క్లుప్తంగా

వైభవంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకారంలో ఆంజనేయస్వామి

నందలూరు : మండలంలోని కుంపిణీపురం భోగాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వీణా రాఘవాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం ఉపనయనం, పంచామృతాభిషేకం, స్వామివారికి ఆకుపూజ, ఆస్థాన పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామివారు గరుడ వాహనంపై పుర వీధులలో ఊరేగారు. భక్తులు కాయాకర్పూరం సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు.

తోపు గంగమ్మకు బోనాలు



ప్రత్యేక అలంకరణలో తోపుగంగమ్మ

రాయచోటి టౌన్ : పాత రాయచోటిలో వెలసిన శ్రీ విజయ చాముండేశ్వరీ దేవి (తోపు గంగమ్మ)కి రథసప్తమి రోజు బోనాలు సమర్పించారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మల్లికార్జున ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు మడికట్టుకొని అన్నప్రసాదాలను అనేక రకాల వంటలు వండి రాసిపోశారు. అనంతరం కొల్లగొట్టి అమ్మవారికి సమర్పించారు.

గృహాల లబ్ధిదారులు అర్హత పత్రాలు సమర్పించాలి

గాలివీడు : పక్కా గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులు అర్హత పత్రాలను సమర్పించాలని హౌసింగ్ ఏఈ రమేష్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లబ్ధిదారులు తప్పనిసరిగా ఆధార్, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతోపాటు పొజిషన్ సర్టిఫికెట్‌ను సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ దగ్గర ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం పక్కా గృహం మంజూరు ధృవీకరణకు ఓటీపీ నమోదు తప్పనిసరిగా చేయించాలన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

పుల్లంపేట : మండలంలోని కేతరాజుపల్లి గ్రామంలో బాలాజీ, జగదీశ్వరీ దంపతుల కుమారుడు కార్తికేయ అక్షరాభ్యాసం సందర్భంగా కేతరాజుపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలకు విద్యాసామగ్రి ఉచితంగా అందజేశారు. అంగన్‌వాడీ టీచర్ సరోజమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివ ఆధ్వర్యంలో పిల్లలకు ఉచితంగా విద్యాసామగ్రి పంపిణీ చేశారు.

పార్కింగ్‌కు స్థలం కేటాయించండి

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని పంచాయతీ వారు పార్కింగ్‌కు స్థలాన్ని ఏర్పాటు చేయాలని ఈఓ ప్రసాద్‌రావుకు మంగళవారం బీకేఎం జిల్లా అధ్యక్షులు పండుగోలు మణి, జయరామయ్య, దార్ల రాజశేఖర్‌లు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్కింగ్ స్థలం కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తే ఈనెల 10న సామూహిక నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వినయ్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

రామాపురం : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో రాయచోటి వాస్తవ్యులు మనోహర్, మనస్వి దంపతుల కుమారుడు రెడ్డిదార్షిక్ మూడవ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం బండపల్లె వద్ద ఉన్న ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు క్లబ్ జోన్ చైర్మన్ లయన్ మహమ్మద్ తెలిపారు. రాబోయే రోజులలో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని తెలిపారు.

పరామర్శ



మాజీ ఎంపీపీ రెడ్డయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీపీ సుదర్శన్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : రెండు రోజుల క్రితం మాజీ ఎంపీపీ రెడ్డయ్య ఇంటిపై దాడి నేపథ్యంలో మంగళవారం లక్కిరెడ్డిపల్లి ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి జాండ్రపల్లెకు వెళ్లి జెడ్పీటీసీ రమాదేవి కుటుంబాన్ని పరామర్శించి దాడి జరిగిన విషయంపై ఆరా తీశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.రమేష్ కుమార్ రెడ్డి దాడి జరిగిన విషయాన్ని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారన్నారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

లోపించిన స్వచ్ఛ సంకల్పం



కుర్నూతలలో ఎస్‌బీఐకు వెళ్లే దారిలో డంప్‌ను తలపిస్తున్న చెత్తాచెదారం



మిస్పా చర్చి సమీపంలో పందుల స్వైరవిహారం



నలందా విద్యానికేతన్ పాఠశాలకు వెళ్లే మార్గంలో..



మనీషా పాఠశాలకు వెళ్లే మార్గంలో చెత్తా చెదారం



రామాలయం సమీపంలోని ఎస్సీ బాలికల వసతి గృహం ఎదుట మురుగు కాల్వలో పేరుకుపోయిన చెత్తాచెదారం

- ఎక్కడ చూసిన అపరిశుభ్ర వాతావరణమే
- ప్రధాన కూడళ్లలో మరుగుదొడ్లు లేక మహిళల అవస్థలు
- నిద్రావస్థలో అధికార యంత్రాంగం

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లె మెయిన్ రోడ్డు, ప్రధాన వీధుల్లో ఎక్కడ కూడా ఒక్క మరుగుదొడ్డి లేదు. దీంతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్వచ్ఛ భారత్ అంటే చీపుర్లు పట్టుకొని ఫొటోలకు పోజివ్వడం కాదు.. గ్రామాలల్లో, లక్కిరెడ్డిపల్లె టౌన్ పరిధిలోను మరుగుదొడ్లు లేక మహిళలు అవస్థలు పడుతున్నారు. సభలు జరుగుతూనే ఉన్నాయి కానీ లక్ష్యాలు పూర్తవ్వడం లేదు. దీంతోపాటు లక్కిరెడ్డిపల్లె టౌన్ పరిధిలో కనీసం ఒక్కటంటే ఒక్క మరుగుదొడ్డి నిర్మించలేదు. మండలంలో అప్పుడప్పుడు స్వచ్ఛ భారత్ చేపడుతున్నారు. కానీ పిచ్చి మొక్కలు, చెత్త తొలగింపు వరకే పరిమితం అవుతున్నారు. ప్రజలు బహిరంగ మల, మూత్ర విసర్జన చేయకుండా తగిన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టడంలేదు.

ఆర్టీసీ బస్టాండ్, జెడ్పీ బాలికోన్నత పాఠశాల గేటు ఎదుట, ప్రహరీకి వెనుక భాగం, నలంద నగర్, మిస్పా చర్చి పక్కరోడ్డు, మనీషా స్కూల్‌కు వెళ్లే దారి వంటి ప్రాంతాలల్లో ఆరుబయటనే మల, మూత్ర విసర్జనతోపాటు చెత్తాచెదారం యథేచ్ఛగా కొనసాగుతుండంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. అనతి కాలం నుంచి ఆర్టీసీ బస్టాండ్ అద్దెకు ఇవ్వడంతో అక్కడ ఉన్న మరుగుదొడ్లు పూర్తిగా పాఠశాల ఆధీనంలోకి వెళ్లిపోవడంతో ఎక్కడా మరుగుదొడ్లు లేకపోవడంతో వాటి గురించి పట్టించుకునే వారు లేరు. ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండ్‌ను అందుబాటులోకి తీసుకురావడానికి లక్షలు ఖర్చు చేసి తుది మెరుగులు దిద్దారు. కానీ ఎటువంటి ఉపయోగం లేకుండా నిరుపయోగంగా పడిఉంది. దీంతోపాటు రూ.10 లక్షలు ఖర్చు చేసి చెత్త సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినా అది వినియోగంలో లేకపోవడంతో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయి దర్శనమిస్తుండడమే కాక పందులు సంచరించి దోమల బెడద అధికమవుతున్నా గ్రామ పంచాయతీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక చొరవ చూపి బహిరంగ మల, మూత్రశాలలు నిర్మించడంతోపాటు చెత్త, చెదారంను తొలగించాలని లక్కిరెడ్డిపల్లె ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నారు



లక్కిరెడ్డిపల్లె టౌన్‌తోపాటు మర్రిచెట్లు, చింతకుంటవాండ్లపల్లెలలో ఎక్కడా టాయిలెట్ సదుపాయాలు లేవు. దీంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తా చెదారంతో పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తుండడంతో దోమలు అధికమవుతున్నాయి. అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పటికైనా అధికారులు మరుగుదొడ్లను మండల కేంద్రంలో నిర్మించాలి.

- సయ్యద్ అమీర్, కో-ఆప్షన్ సభ్యులు, లక్కిరెడ్డిపల్లె

చెత్త సేకరణ కేంద్రం ఉన్నా ఫలితం సున్నా



రూ.10 లక్షలు ఖర్చు చేసి టౌన్‌కు దగ్గరలో చెత్త సేకరణ కేంద్రాన్ని నిర్మించారు. అయినా ఎక్కడి చెత్త అక్కడే గుట్టలు గుట్టలుగా వార్డుల్లో కనిపిస్తోంది. చెత్తతో సంపద తయారీ అన్నారు. కానీ అమలు మరిచారు. ఎక్కడే కాని బహిరంగ మరుగుదొడ్లు నిర్మించలేదు. అనేక మంది మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, సుదూర ప్రాంత ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరచి చెత్తను తొలగించాలి.

- దస్తగిరి, ఎంపీటీసీ, లక్కిరెడ్డిపల్లె టౌన్

స్థలం లేక నిర్మించలేకపోతున్నాం

బహిరంగ మరుగుదొడ్లను స్థలం లేక నిర్మించలేకపోతున్నాం. తమ పంచాయతీకి ఒకేఒక్క ట్రాక్టర్ ఉండడంతో రెండు, మూడు వారాలు పడుతోంది చెత్తను తొలగించాలంటే. చెత్త ఉన్న ప్రాంతాలు తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే రెండు మూడు రోజుల్లో తొలగించేస్తాం. చెత్తను డంప్ చేయడానికి ప్రభుత్వం స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. చెత్త సేకరణ కేంద్రానికి దారి లేక అవస్థలు పడుతున్నాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- సుదర్శన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, లక్కిరెడ్డిపల్లె

సచివాలయం పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పెనగలూరు : నల్లపురెడ్డిపల్లి సచివాలయాన్ని ఎంపీడీఓ విజయారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు పలు రికార్డులను పరిశీలించారు. సర్వేలను వెంటనే పూర్తి చేసి నివేదికలు అందజేయాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన వివిధ సర్వేలను ఆయా శాఖ సిబ్బంది సర్వేచేసి వెంటనే నివేదికలు ఇవ్వాలన్నారు. పలు సమస్యలపై సిబ్బందితో వారు చర్చించారు.

జాతీయ రహదారిపై విద్యుత్ దీపాలు



జాతీయ రహదారిలోని బొమ్మవరం క్రాస్ వద్ద ఏర్పాటైన ఫోకస్సింగ్ లైట్లు

ఓబులవారిపల్లె : మండలంలోని మంగళంపల్లి, బొమ్మవరం గ్రామాల నుంచి జాతీయ రహదారిపై కలిసే చోటు రాత్రి సమయంలో ఇటీవల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మంగళవారం ఎస్ఐ పి.మహేష్ చొరవతో జాతీయ రహదారి నుంచి మంగళంపల్లి, బొమ్మవరం క్రాస్‌ల వద్ద ఫోక్సింగ్ లైట్లను ఏర్పాటు చేశారు. దీంతో రాత్రి సమయంలో ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగకరంగా మారింది. ప్రమాదాలు జరగకుండా ఎస్ఐ చర్యలు చేపట్టడం హర్షనీయమని మండల ప్రజలు తెలియజేశారు.

కమనీయం.. శ్రీవారి కల్యాణం



కల్యాణ క్రతువులో పాల్గొన్న భక్తులు



కల్యాణ ఉత్సవ మూర్తులు

రాజంపేట టౌన్ : పట్టణంలోని రామ్‌నగర్‌లో వెలసిన తిరుమలగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కోడూరు చలపతి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. తొలుత కల్యాణ ఉత్సవ మూర్తులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకంగా తయారు చేసిన వేదికపై కొలువుదీర్చారు. అనంతరం వేదపండితులు వేదమంత్రోచ్ఛరణలతో స్వామివారి కల్యాణ క్రతువును కమనీయంగా జరిపించారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి కల్యాణ మహోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు జెనుగు కృష్ణారావుయాదవ్, వివిధ విభాగాల కన్వీనర్లు పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, సౌమిత్రి, చెంగం శివప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుక

ఏటా మాఘ మాసంలో శుక్ల పక్ష సప్తమి, తిథిని రథ సప్తమిగా జరుపుకుంటారు. ఈ రథసప్తమి రోజున సూర్యనారాయణుడి జన్మదినంగా కూడా జరుపుకోవడం ఆనవాయితీ. అన్ని మండలాల్లో వైష్ణవ ఆలయాల్లో వేకువజాము నుంచే స్వామి వార్లకు విశేష పూజలు చేశారు. ఉదయం నుంచే ఆలయాల వద్ద భక్తుల తాకిడి కనిపించింది. పలు ఆలయాల్లో స్వామి వారి ఉదయం సూర్యప్రభ, సాయంత్రం చంద్రప్రభ వాహనాల్లో ఊరేగించారు. ఆలయాల్లో భక్తులకు అన్నప్రసాదాలన వితరణ చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



రామాపురం: పూజలందుకుంటున్న కంభరాయుడి గుట్టపై వెలసిన శ్రీ మహావిష్ణువు



రైల్వేకోడూరు అర్బన్: ప్రత్యేక అలంకారంలో వేంకటేశ్వరుడు



సిద్దవటం: మాధవరం-1లో శ్రీ భద్రావతీ భవనారాయణ స్వామి ఉత్సవ మూర్తుల గ్రామోత్సవం



రైల్వేకోడూరు అర్బన్: రాములవారి గ్రామోత్సవం



రాయచోటి టౌన్ : సూర్యభగవానుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భద్రతా నియమాలు తప్పక పాటించాలి



మాట్లాడుతున్న ఎంవీఐ వినోద్ కుమార్

నందలూరు : రహదారి భద్రతా నియమాలు తప్పక పాటించాలని రాజంపేట మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు సందర్భంగా మండలంలోని నందలూరు షాదీ ఖానాలో మంగళవారం రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నూరు సీఐ బీవీ రమణ మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరమన్నారు. పరిమితికి మించి ఆటోలలో ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. రహదారి భద్రతా చట్టాలను అతిక్రమిస్తే మోటార్ వాహన చట్టం సెక్షన్ 86 ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ శంకర్ నాయక్, వాహనదారులు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.


రైతులు యాజమాన్య పద్ధతులను అవలంభించాలి



కడపాయపల్లెలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సిద్దవటం : రైతులు అధికారుల సలహాలతో ఉత్తమ యాజమాన్య పద్ధతులను అవలంభించాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. మండలంలోని కడపాయపల్లె గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. మొదట గ్రామ సభ ఏర్పాటు చేసి రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వివరించారు. గ్రామంలో సాగు చేస్తున్న నువ్వులు, వరి, కూరగాయలు, ఆకుకూరలు పంటలలో తీసుకోవాల్సిన జాగ్రతలు, సస్యరక్షణ చర్యలను తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవ నియంత్రణ, తెగుళ్ల మందుల వినియోగం, జీవన ఎరువులు, విత్తనాల కొనుగోలులో జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించారు. 200 కిలోల ఘన జీవామృతం తయారు చేశారు. కడపాయపల్లెలో వరి పంటను పరిశీలించి చీడపీడల నివారణకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు సేవా కేంద్రం సహాయకులు వంశీ శివ ఫణీంద్ర, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుంటిమడుగు మృతి



గుంటిమడుగు సుధాకర్‌రాజు(ఫైల్)



నివాళులు అర్పిస్తున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, మాజీ ఎంపీటీసీ గుంటిమడుగు సుధాకర్‌రాజు (65) మంగళవారం తన స్వగ్రామం సిద్ధిరాజుకండ్రికలో గుండెపోటుతో మృతి చెందారు. పార్టీ ఆవిర్భావం నుంచి నియోజకవర్గ పార్టీ బలోపేతానికి క్రియాశీలకంగా వ్యవహరించారు. పార్టీ కార్యక్రమాలను ముందుండి నడిపించేవారు. వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, మండల నాగేంద్ర తదితర నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆకాల మరణం పార్టీ తీరనిలోటని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. నేడు(బుధవారం) ఆయన స్వగ్రామంలో అంత్యక్రియలు జరగనున్నట్టు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో హరికృష్ణారెడ్డి, బత్తల సుబ్రమణ్యం, డీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్ రాజు మృతి తీరనిలోటు

ఓబులవారిపల్లె : పార్టీ కష్టకాలంలో కార్యకర్తలు, నాయకులకు తోడుండే రైల్వేకోడూరు నియోజకవర్గ క్షత్రియ నాయకుడు గుంటిమడుగు సుధాకర్ రాజు మరణం తీరనిలోటని ఏపీటీడీసీ మాజీ డైరెక్టర్, మండల అధ్యక్షులు వత్తలూరు సాయికిషోర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుంటిమడుగు సుధాకర్ రాజు వైఎస్సార్‌సీపీకి ఎనలేని సేవలు అందించారని, కీలక నాయకుడు మృతి చెందడం పార్టీకి తీరనిలోటని పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేస్తున్నామని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు తెలిపారు.

ఏఐటీయూసీ మహాసభలను విజయవంతం చేయండి

రైల్వేకోడూరు అర్బన్ : ఫిబ్రవరి 16, 17 తేదీలలో రైల్వేకోడూరులో జరిగే ఏఐటీయూసీ మహాసభలను విజయవంతం చేయాలని మంగళవారం జిల్లా కార్యదర్శి గంగాధర్ తెలిపారు. మండలంలోని తంబళ్లపల్లి ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి రమేష్, బాలక్రిష్ణరాజు చేతులమీదుగా గోడపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాసభలకు కార్మికులు, విద్యార్థులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని అప్పకొండయ్యగారిపల్లి అరుంధతివాడకు చెందిన విద్యార్థి జానకొల్లా అఖిల కలికిరిలో డిప్లమా హార్టికల్చర్ చదువుతోంది. కళాశాల ఫీజు చెల్లించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో విద్యార్థిని మానవతను ఆశ్రయించింది. స్పందించిన ట్రస్టు సభ్యులు మంగళవారం లక్కిరెడ్డిపల్లి గర్ల్స్ హైస్కూల్‌లో విద్యార్థినికి రూ.13 వేలు అందించారు.

హెల్మెట్ తప్పనిసరి

రామాపురం : సురక్షిత ప్రయాణానికి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పోలీస్ స్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల రికార్డులు పరిశీలించారు. నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల బారి నుంచి తప్పించుకోవచ్చన్నారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని వాహనాలకు ఎస్ఐ జరిమానా వేశారు. ఆయన వెంట మండల పోలీసుల సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అధినేతను కలిసిన కొరముట్ల



అధినేతతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం తీసుకోవాల్సిన చర్యలపై అధినేతకు వివరించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పేదలకు సంక్షేమ పథకాలు అందకపోవడం, అభివృద్ధి పనులు నిలిచిపోవడం తదితర అంశాలపై చర్చించినట్టు కొరముట్ల తెలియజేశారు. ప్రతి కార్యకర్త, నాయకులు, పేద ప్రజలకు పార్టీ అన్ని వేళలా అండగా ఉండి పోరాడుతుందని అధినేత తెలిపినట్లు పేర్కొన్నారు.

క్యాన్సర్ వ్యాధిగ్రస్తునికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నందలూరు : మండలంలోని ఓబిలి గ్రామానికి చెందిన ఎస్ ప్రవీణ్ అనే యువకుడికి క్యాన్సర్ వ్యాధి రావడంతో చికిత్సకు ఆర్థికంగా ఇబ్బంది పడుతుండటంతో అతని మిత్రులు లయన్స్ క్లబ్‌కు తెలియజేసి రోజువారి మందుల కొరత కొంత ఆర్థిక సహాయం చేయమని కోరగా క్లబ్ మెంబర్స్ తక్షణమే స్పందించి మంగళవారం ప్రవీణ్‌కు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో విభా ఎరుడైట్ స్కూల్ చైర్మన్ డాక్టర్ విజయభాస్కర్ రావు, లయన్ మన్నెం రామ్మోహన్, డాక్టర్ బుచ్చు జయభాస్కర్ రావు, బెటాలియన్ ఎస్ఐ మన్నెం రామ్మోహన్, లయన్ కుర్రామణి యాదవ్, కొత్తపల్లి రాజాచారి, దాసరి నరసింహులు, మోడపోతుల రాము, గంధం గంగాధర్, గుండు సురేష్‌లు పాల్గొన్నారు.

గ్రామీణులకు వైద్య సౌకర్యమే లక్ష్యం



విజయమ్మకు ఆర్థిక సాయం చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

రాజంపేట రూరల్ : అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ ఐఎస్‌సీ అమెరికా తరఫున ఎంజీ పురానికి చెందిన విజయమ్మ అనే మహిళలకు రూ.65 వేల ఆర్థికసాయాన్ని ఫౌండేషన్ అనుసంధాన అధికారులు డాక్టర్ రవిరాజు, న్యాయవాది కొండూరు శరత్‌కుమార్‌రాజులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికాలో వైద్యుడిగా సేవలందిస్తున్న డాక్టర్ భూపతిరాజు ఈ ఫౌండేషన్‌ను స్థాపించారని తెలియజేశారు. అనారోగ్యం బాధపడుతూ తిరుపతిలో చికిత్స పొందిన విజయమ్మకు సంస్థ ఆధ్వర్యంలో ఆర్థికసాయం చేశామన్నారు.